క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఈఈటీ


ఈఈటీగా బాధ్యతలు స్వీకరించిన పీర్ అహ్మద్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఈ సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్)గా నియమితులైన పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో ఏలూరు ఈఈ టెక్నికల్‌గా పని చేస్తున్న ఎం. యూనీస్‌ని పశ్చిమ గోదావరి జిల్లా ఈఈటీగాను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆపరేషన్స్ ఈఈగా పని చేస్తున్న పీర్ అహమద్ ఖాన్‌ను ఏలూరు ఈ టెక్నికల్‌గా నియమించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అహ్మద్ ఖాన్‌ను ఎస్ఈ పి. సాల్మన్ రాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం


ఎస్సై నరసింహారావు కుమారుడికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి సిబ్బంది కుటుంబానికి తామంతా ఎప్పుడూ అండగా ఉంటామని, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు సీసీఎస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన డి.నరసింహారావు కుటుంబానికి ఆయన ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ చాంబర్‌లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎస్సై నరసింహారావు కుమారుడు సీతారామకు ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ.25వేలు, విడో ఫండ్ నుంచి రూ.50 వేలు చెక్కులను జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకానికి సిఫార్సులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కొండెక్కిన భూముల రీసర్వే

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా సర్వే రాళ్లు
- వైఎస్సార్ సీపీ హయాంలో 42,752 ఎకరాలు భూమి గుర్తింపు


డ్రోన్ ద్వారా భూముల సర్వే ప్రక్రియ చేపట్టిన అధికారులు (ఫైల్)


గ్రామాల శివారున సరిహద్దులు గుర్తిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన భూముల రీసర్వే అర్ధాంతరంగా నిలిచిపోయింది. రైతులు, భూ యజమానులకు ఎంతో మేలు చేసిన ఈ కార్యక్రమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే రైతు భూమి సర్వే చేసి, రికార్డుల్లో నమోదు చేసి హక్కు పత్రాలు అందించిన కార్యక్రమాన్ని నేటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై భూ యజమానులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలకు చక్కని పరిష్కారం

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంలో రైతుల మన్ననలు అందుకుంది. 2023 అక్టోబర్‌లో రెవెన్యూ అధికారులు ఏలూరు రూరల్ మండలం కాట్లంపూడి, కొక్కిరాయిలంక గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. సర్వేలో వెలుగుచూసిన పలు అంశాలిలా ఉన్నాయి..
- కాట్లంపూడి గ్రామానికి చెందిన ఓ రైతు పేరిట 80 సెంట్లు భూమి ఉంది. రీసర్వేలో సదరు రైతుకు 4 సెంట్లు తగ్గింది. రైతు దరకాస్తు చేసుకోగా, అధికారులు సరిహద్దుల రైతులకు నోటీసులు ఇచ్చి, వారి సమక్షంలో 4 సెంట్లు భూమి గుర్తించి రైతు పేరిట రికార్డుల్లో నమోదు చేశారు.
- 15 ఏళ్ల క్రితం నలుగురు అన్నదమ్ములు తండ్రి భూమి పంచుకుని, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి ఎవరు భూములు ఎక్కడున్నాయో తెలియని స్థితి నెలకొంది. సరిహద్దులు గుర్తించలేక మల్లగుల్లాలు పడ్డారు. ఏళ్ల తరబడి సర్వే చేయాలని అనేకసార్లు అధికారులు వినతిపత్రాలు అందించారు. అయినా ఫలితం కానరాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలుసుకుని అధికారులను కలుసుకున్నారు. వెంటనే అధికారులు వారి పత్రాలు పరిశీలించి, భూమి సరిహద్దులు గుర్తించి, అప్పగించారు. ఇలాంటి అనేక సమస్యలకు ఏడాది క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమం పరిష్కారం చూపింది. ఈ విషయాలు తెలుసుకున్న రైతులు తమ గ్రామాల్లో సైతం రీసర్వే జరిగితే మేలు జరుగుతుందని ఆశ పడ్డారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అయినప్పటికీ రీసర్వే చేపట్టలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో హర్షం

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన భూముల రీసర్వేపై సర్వత్రా హర్షం వ్యక్తమయ్యింది. గ్రామాల్లో పంట కాలువలు, బళ్లదారి, భూమి సరిహద్దులపై రైతులు ఘర్షణలకు తెరపడుతుందని భావించారు. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భూముల రీసర్వే చేపట్టడం వల్ల ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సంబరపడ్డారు. పక్కా సరిహద్దులతో రికార్డుల్లో నమోదు చేసుకుంటే ఆక్రమణలు, అక్రమాలకు చోటు ఉండదని రైతులు భావించారు.

6 నెలలు కష్టించి సర్వే

వైఎస్సార్ సీపీ హయాంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది 6 నెలల పాటు ఎంతో కష్టించి సర్వే చేశారు. సర్వే ఆఫ్ ఇండియా అనుమతి పొందిన సంస్థలతో చేపట్టిన డ్రోన్ సర్వే విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో 15 గ్రామాల విస్తీర్ణం 170 చదరపు కిలోమీటర్లగా లెక్క తేలింది. 42 వేల 752 ఎకరాల భూమి ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. గ్రామ కంఠం, పంట కాలువ, బళ్లదారి, చెరువులు తదితర ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టారు. గ్రామానికి ఒక యూనిట్‌గా తీసుకుని డ్రోన్ ఎగరేసి జియో ట్యాగింగ్ ద్వారా భూమి మొత్తం వివరాలు సేకరించారు. ఆర్థో రిక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ మ్యాప్) రూపొందించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి, సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు.


చాటపర్రు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న సర్వేరాళ్లు

నిరుపయోగంగా సర్వే రాళ్లు

రైతుల మేలు కోరి నాటి ప్రభుత్వం ఉచితంగా అందించిన సర్వే రాళ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కాట్లంపూడి, మల్కాపురంతో పాటు 13 గ్రామాల్లో సచివాలయ సర్వేయర్లు, రైతుల సమక్షంలో సరిహద్దులు గుర్తించారు. సరిగ్గా సరిహద్దు రాళ్ల పాతి, భూమి యజమానులకు యూనిక్ నంబర్లు ఇవ్వాల్సి ఉంది. ఈ నంబర్ ద్వారా రైతులు భూములు కొనుగోలు, అమ్మకాలు జరిపి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సరిగ్గా ఈ సమయంలోనే ఎన్నికల జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడింది.

> **ప్రభుత్వ ఆదేశాలు అందాలి**
>
> భూముల రీసర్వేపై ప్రభుత్వం నుంచి ఆదేశాల అందలేదు. గత ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వే కోసం నియమించిన డిప్యూటీ తహసీల్దార్ల డిప్యూటేషన్లు నేటి ప్రభుత్వం కొనసాగిస్తోంది. అంటే సర్వే ప్రక్రియను ఈ ప్రభుత్వం సైతం కొనసాగిస్తుందని అనుకుంటున్నాం. ప్రభుత్వం సూచనల మేరకు అధికారులు ఆదేశాలు ఇస్తే తిరిగి రీసర్వే చేపడతాం.
>
> –నాగమణి, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్

రేపు శాస్త్రీయ సంగీత కచేరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శాస్త్రీయ సంగీత కచేరి ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విజయవాడకు చెందిన శాస్త్రీయ సంగీతంలో విశిష్టులైన మల్లాది కుటుంబ వారసులు మాస్టర్ మల్లాది శివానంద యశస్వి గాత్ర ఆలాపనతో, కుమారి మల్లాది సింధు రాగేశ్వరి వయోలిన్ సహకారంతో మల్లాది అరవింద్ కార్తీక్ మృదంగం వాయిద్య సహకారంతో ఈ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


ఏలూరులో నిర్వహించిన టీటీ పోటీల్లో పాల్గొన్న బాలలు

ఏలూరు రూరల్ : దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవలో క్రీడాకారులందరూ భాగస్వాములు కావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఏలూరులో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు అక్టోబర్ 2న బహుమతులు అందిస్తామన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

ఏలూరు రూరల్: రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిపై విద్యార్థుల ఆలోచనలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని ఏలూరు రూరల్ మండల విద్యాశాఖాధికారి రంగయ్య కొనియాడారు. శుక్రవారం స్వర్ణాంధ్ర 2047 ఐదేళ్ల దార్శనికత ప్రణాళిక అనే అంశంపై జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రం సిబ్బంది విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, డిబేట్ నిర్వహించారు. ఇందులో వ్యాసరచన పోటీల్లో కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన కె వంకటలహరి, డిబేట్, వకృత్వ పోటీల్లో ఈదర సుబ్బమ్మదేవి పాఠశాల విద్యార్థులు కేఎస్‌డీ రమేష్, ఆర్ మమత ప్రథమ బహుమతులు అందుకున్నారు. ఎంఈఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల న్యాయ నిర్ణేతలుగా బెన్హర్, కృష్ణవేణి, శాంతికుమార్‌తో పాటు ప్రభాకర్ వ్యవహరించారని ఎంఈఓ చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఆలోచనలు అద్భుతంగా ఉన్నాయని, అభివృద్ధిపై అవగాహన కలిగి ఉన్నారని ఎంఈఓ వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సోషల్‌మీడియా మాధ్యమాలతో అనేక అనర్థాలకు తావిస్తోన్న తరుణంలో అపరిచిత వ్యక్తులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, సైబర్‌సెల్ ఎస్సై మధు వెంకట రాజా కోరారు. ఏలూరు సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, సోషల్‌మీడియా మాధ్యమాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ముంబై, చెన్నై, కోల్‌కత్తా ప్రాంతాల నుంచి సీబీఐ అధికారులమంటూ ఫోన్ చేస్తూ మీ పేరుతో విదేశాల నుంచి డ్రగ్స్ వస్తున్నాయంటూ బెదిరిస్తూ భారీగా డబ్బులు గుంజుతున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయని బెదిరిస్తూ మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లు ఎక్కువయ్యారని, విద్యార్థులు వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి మోసాలకు సంబంధించి ఏవైనా ఫోన్ కాల్స్ లేదా మెస్సేజ్‌లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. తక్కువ మొత్తంలో పొదుపు చేస్తే అధికంగా డబ్బులు సంపాదించే అవకాశం ఉందంటూ ఆశ చూపించి, పెద్దెత్తున డబ్బులు కాజేస్తోన్న మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్‌మీడియా మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తులతో, ఆన్‌లైన్ మెస్సేజ్‌లతో, లింకులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమనీ, కేవైసీ అంటూ ఏదైనా ఫోన్‌కాల్, మెస్సేజ్ వస్తే వాటిపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మీ సెల్‌ఫోన్ పాస్‌వర్డ్‌లు విషయంలోనూ నిర్లక్ష్యంగా ఉంటే హ్యాకర్లతో ప్రమాదం పొంచి ఉందన్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభం


కేరళకు చెందిన వైద్య విద్యార్థినికి అడ్మిషన్ పత్రాన్ని అందజేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌కు సంబంధించి మొదటి కౌన్సెలింగ్ శుక్రవారంతో పూర్తయ్యింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను 2023 ఏప్రిల్‌లో 26న ప్రభుత్వం అనుమతులు ఇచ్చి 150 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసింది. దీంతో గతేడాది అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది 23వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సు తరగతులు ప్రారంభమయ్యాయి. రెండవ బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరానికి 150 సీట్లను మంజూరు చేశారు. దీంతో ఆలిండియా కోటా కింద 22 సీట్లు, రాష్ట్ర కోటా కింద 55 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా కింద 14 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద 36 సీట్లు ఇతర కోటా కింద 23 సీట్లను కేటాయించారు. ఆలిండియా కోటా కింద మొదటి కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. రాష్ట్ర కౌన్సెలింగ్ కూడా గురువారంతో ముగిసింది. ఇప్పటి వరకూ ఆలిండియా కోటా కింద 22 సీట్లకు 19 మంది చేరారు. రాష్ట్ర కోటాలో 55 సీట్లు ఉండగా 53 మంది చేరారు. కన్వీనర్ కోటాలో 23 సీట్లు ఉండగా చేరాల్సి ఉంది. ఎన్ఆర్ఐ కోటాలో 14 మంది. సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో 36 మంది చేరారు. ఆలిండియా కోటాలో నీట్ అర్హత పొందిన కేరళకు చెందిన విద్యార్థి హృదయ్ తన తల్లిదండ్రులతో వచ్చి ఏలూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ అడ్మిషన్ ధ్రువపత్రాన్ని విద్యార్థిని అందించి అభినందనలు తెలిపారు

తిరుమల లడ్డూ విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలి

ఏలూరు (టూటౌన్): తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ సమస్యపై పూర్తి స్థాయి విచారణ చేసి నిజాలను నిగ్గుతేల్చి దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం, ప్రతిపక్షం అంత వరకు సంయమనం పాటిస్తూ రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టకుండా చూడాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీటీడీ లడ్డూ సమస్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ సమగ్ర విచారణ చేయాలని, దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. లడ్డూ వ్యవహారాన్ని సాకుగా తీసుకొని బీజేపీ ప్రజలను రెచ్చగొట్టడానికి, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వారి ఆధీనంలోకి తెచ్చుకోవడం కోసం వ్యూహాలు పన్నుతోందని రవి ఆరోపించారు.

ప్రమాదాలు, నేరాల నియంత్రణకు సహకరించాలి


క్యూఆర్ కోడ్‌తో కూడిన ఆటో స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, వీవీఎన్ గ్లోబల్ టెక్నాలజీస్ ప్రతినిధులు

ఏలూరు టౌన్ : రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు ఆటో డ్రైవర్లు తమవంతు బాధ్యతగా నడుచుకోవాలనీ, కుటుంబ పోషణకు ఉపాధి మార్గంగా ఆటోడ్రైవర్లుగా పని చేస్తున్నవారంతా ప్రమాదాల నివారణకు సహకారం అందించాలని ఏలూరు ట్రాఫిక్ సీఐ కే.శ్రీనివాసరావు కోరారు. ఏలూరు అమీనాపేట శ్రీసురేష్ చంద్ర బహుగుణ స్కూల్ గ్రౌండ్స్‌లోని కల్యాణ మండపంలో ఆటోవాలాలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వీవీఎన్ గ్లోబల్ టెక్నాలజీస్ టీమ్ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ తో కూడిన స్టిక్కర్లను ఆటోలకు అందజేస్తామని చెప్పారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో యజమాని పూర్తి అడ్రస్, వివరాలు, ఆటో ఏ స్టాండ్‌కు సంబంధించినది, ఫోన్, ఆధార్ నంబర్‌తో సహా వస్తాయని తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాలతోనే క్యూ ఆర్‌కోడ్ కార్డులను తయారు చేసినట్లు చెప్పారు. ఆటోలలో ప్రయాణించే వారు ముందుగా క్యూ ఆర్‌కోడ్ కార్డులను ఫొటో తీసుకుని తమ కుటుంబ సభ్యులకు వాట్సాప్‌లో పెట్టటం ద్వారా ముందుస్తు జాగ్రత్తగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు ట్రాఫిక్ ఎస్సై రంగారావు, ఆర్ఎస్సై అమరేశ్వరరావు, శానం రమేష్‌బాబు, ఏలూరు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యను అడ్డుకున్న పెదవేగి పోలీసులు

ఏలూరు టౌన్ : దెందులూరు మండలం రామారావుగూడెంకు చెందిన బొగ్గారి భాస్కరరావు ఇంటిమీద బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అతను వాయిదా చెల్లించలేదనే కారణంగా లోన్ రికవరీ ఏజెంట్లు భాస్కరరావు ఇంటికి వచ్చి హడావుడి చేశారు. బ్యాంకు రుణం వాయిదా చెల్లించేందుకు అప్పు అడిగేందుకు వెళుతున్నా అని చెప్పి స్కూటీపై బయలుదేరిన భాస్కరరావు పెదవేగి మండలం వేగివాడ బ్రిడ్జి వద్ద వాహనాన్ని ఆపి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలంటూ భార్య రత్నకుమారికి చెప్పాడు. భార్య వెంటనే డయల్ 112కు మధ్యాహ్నం 3.27 గంటలకు కాల్ చేసి సమాచారం అందించింది. తక్షణమే స్పందించిన పెదవేగి స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసు కాలువ వద్దకు వెళ్లగా కాలువలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్న బాధితుడు భాస్కరరావును నిలువరించాడు. కౌన్సెలింగ్ ఇచ్చి అతడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించాడు.

అక్టోబర్ 1న రాష్ట్రవ్యాప్త దీక్షలు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ ఒకటో తేదీన జరిగే నిరసన దీక్షలను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘ నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు యు.క్రాంతి అధ్యక్షత వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న మాట్లాడారు. లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం తన అనుయాయులకు కట్టబెట్టడం కోసం ప్రైవేట్‌పరం చేస్తోందని, దీన్ని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు. తిరుపతి లడ్డూ గురించి గగ్గోలు పెట్టే సీఎం, డిప్యూటీ సీఎంలు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. పలువురు వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలేవీ ?

గణపవరం: ఉండి నియోజకవర్గం కాళ్లమండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని బలవంతంగా పీకివేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లిరాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గణపవరం మండలం సరిపల్లెలో అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. మాలమహానాడు నాయకులు నల్లి రాఖీభాయ్, బుర్కా ఏసు పాల్గొన్నారు.

అభివృద్ధికి విలువైన సూచనలివ్వండి


మండల పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ, అధికారులు

ఏలూరు రూరల్: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ విలువైన సలహాలు, సూచనలు అందించాలని ఏలూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదేపల్లి, మల్కాపురం ఎంపీటీసీలు నరహరశెట్టి నాగమణి, బొమ్మవరపు మణెమ్మతో పాటు రత్నం పలు సమస్యల వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారుల బిల్లులు పెండింగ్ గూర్చి ఎంపీడీఓ బి ప్రణవి ప్రశ్నించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మరో మూడు నెలల్లోపు జగనన్న ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించిందన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. తర్వాత ఫేస్–2 విభాగంలో కొత్త ఇళ్లకు అనుమతి ఇస్తుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీపీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాలు తెలుసుకుని అప్‌డేట్ చేసి, బిల్లులు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు కొల్లేరులో కోమటిలంక గ్రామం ప్రధాన రోడ్డు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఈ రోడ్డు స్థానంలో వంతెన నిర్మించేందుకు అటవీశాఖ అధికారుల ద్వారా అనుమతులు పొందాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, సూపరింటెండెంట్ వై సుజాతతో పాటు పీఆర్ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంఎన్ఆర్ ఈజీఎస్ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్ల పాటు పనిచేసి బదిలీపై వెళుతున్న ఎంపీడీఓకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు(మెట్రో) : ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా జిల్లా పరిషత్‌ను ఉన్నతంగా నిలబెట్టాలని జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్‌ను పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరింగ్ అధికారిగా నియమితులైన ఐ.మల్లేశ్వరి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.భీమేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

జీవ వైవిధ్యం ముఖ్యమైన పర్యావరణ వ్యవస్థ



జంతు పక్ష్యాదుల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవ శ్రేయస్సుకు జీవవైవిధ్యం చాలా ముఖ్యమైన పర్యావరణ వ్యవస్థ అని సెయింట్ థెరిసా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో సిస్టర్ సుశీల పాల్గొని మాట్లాడుతూ జీవవైవిధ్యం అనేది వ్యవసాయం, ఔషధ వనరులు, సాంస్కృతిక సౌందర్య విలువలు, ఆర్థిక ప్రయోజనాలు, వాతావరణ మార్పులు, పర్యావరణ సమతుల్యతకు ఆధారమన్నారు. ఈ సందర్భంగా జంతు శాస్త్ర విభాగాధిపతి ఇందిర మాట్లాడుతూ విభిన్న వాతావరణ పరిస్థితులు, పర్యావరణ అనుకూలతలు కలిగిన రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర జంతువుల విశేషాలను, అక్కడి వాతావరణ పరిస్థితులను తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కామర్స్ విభాగాధిపతి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సంవత్సరం 2024 పర్యాటక దినోత్సవ థీమ్ ప్రపంచ పర్యాటకం మరియు శాంతి అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ విద్యార్థినులు ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో వివిధ రకాల విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎంత మోతాదులో తీసుకోవాలి అనే విషయంపై 'మై ప్లేట్' పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎస్సీ మూడవ సంవత్సరం జువాలజీ విద్యార్థినులు, న్యూట్రిషన్ విద్యార్థినులు సంయుక్తంగా నిర్వహించిన నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో మన దేశంలోని వివిధ రాష్ట్రాలలో విస్తరించి ఉన్న రాష్ట్ర జంతువుల విశేషాలపై ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమ నిర్వాహకులను ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియ క్రిస్టియ, అధ్యాపకులు అభినందించారు.